అపార్థము

శ్రీమతి దాసరి శారద

మాలతి ఆ సంవత్సరమే స్కూలు ఫైనలు పరీక్షలో కృతార్థురాలై క్రొత్తగా కళాశాలలో కాలు పెట్టినది. మాలతి చిన్నతనమునుండి ఆడపిల్లల బడిలోనే చదివింది. మంచి తెలివికలది. ఎప్పుడు పరీక్షలు జరిగినా మాలతిదే ఫస్టుమార్కు. కాని యిప్పుడు కళాశాల వాతావరణం ఆమెకు చాల క్రొత్తగా నున్నది. అసలే బస్తీ. అందులోనూ మహిళా కళాశాలకూడ కాదు. చిన్నతనంనుంచి ఆడపిల్లల బడిలోనే చదివిన మాలతికి మగపిల్లల కాలేజీలో చదవటము కొంచెం కష్టంగానే వున్నది. కాని ఆమె ఎలాగో నెమ్మదిగ అలవాటుచేసుకున్నది.

మాలతి సన్నగా, కొంచెము పొట్టిగా ఉంటుంది. పచ్చని శరీరచ్ఛాయ, పొడవైనజడ. చూచేవారిని యిట్టే ఆకర్షిస్తుంది.

మాలతి మొదటిసారి క్లాసులో కాలుపెట్టగానే మధుకి ఆమెపై ఏదో తెలియని అభిమానమేర్పడింది. ఆమె వినయము, నడకతీరు అతనిని ముగ్ధుణ్ణిచేశాయి. మాలతినిచూచి మధు ఏమిటో, ఎందుకో సంతోషంతో పొంగిపోయాడు. ఒక వారము రోజులు గడిచినయ్. మాలతి సామాన్యముగా ఎవరితోనూ మాట్లాడేదికాదు. ఆమె నిండుకుండ. తోటి ఆడపిల్లలతోకూడ చాల ముక్తసరిగా మాట్లాడేది. అట్లని ఆమెకు గర్వమని చెప్పకూడదు.

క్రమముగా రోజులు గడచి మాలతి కళాశాల వాతావరణాని కలవాటుపడింది. కాని ఆమె ఎప్పుడూ మగపిల్లలంటే కొంచెం భయపడుతుండేది. ఏమయినా పొరపాటు జరిగితే మగపిల్లలు నవ్వుతారేమోనని ఆమెకు భయము. అందువలన ఆమె అతి జాగ్రత్తతో మెలగుతుండేది. పాఠాలు శ్రద్ధగావిని గంట కొట్టగానే యింటికి వెళ్ళిపోయేది.

మూడు నెలలు గడిచిపోయినయ్. పరీక్షలు జరిగిపోయినవి. సెలవు లివ్వనూ యిచ్చారు, మళ్ళీ కాలేజీ తీయనూ తీశారు. మాలతి మామూలుగా తన తరగతికివెళ్ళి కూర్చున్నది. ఆ రోజు 'లాజిక్' లెక్చరర్ కామేశ్వరరావు క్లాసుకి వచ్చాడు పేపర్ల కట్టతో. పిల్లలందరి దృష్టి పేపర్లమీదే వున్నది. ఇంతలో ఒక పిల్లవాడులేచి "ఫస్టుమార్కు ఎవరిదండీ ?" అని అడిగాడు.

కామేశ్వరరావు ఒకసారి మార్కుల జాబితాను జాగ్రత్తగా పరిశీలించి "ఫస్టుమార్కు 65, మాలతి. నెం॥ 30" అని చెప్పాడు.

"ఆడపిల్ల కదటోయ్. ఫస్టుమార్కురాక ఏమిచేస్తుంది." అని ఒక కంఠము సన్నగా వినిపించింది మాలతికి.

మాలతి గతుక్కుమన్నది.

పాపము మాలతి శక్తినంతటిని ధారపోసి చదివి సంపాదించిందీ ఫస్టుమార్కుని. కాని ఊరికినే అంతమాటవినబడేటప్పటికి మాలతి హృదయము కలుక్కుమన్నది. కళ్ళల్లో నీళ్ళు గిర్రునతిరిగాయి. ఇదంతా గమనిస్తున్నమాలతి స్నేహితురాలు రమ "ఊరుకో మాలతీ! అంత చదువుతూ కూడ కొంచెముకూడ ధైర్యంలేదే? అతనికి నీ విలువతెలియదు గనుకనే అలా అన్నాడు. అంతమాత్రనికి నీ వింతగా బాధపడాలా?" అని ఓదార్చింది. మాలతి ఎలాగో స్థిమితపడింది.

ఇంటిగంట కొట్టగానే తలవంచుకొని వస్తున్న మాలతి "కంగ్రాచ్యులేషన్స్ మాలతీ!" అన్న మాటలు విని వెనక్కుతిరిగి చూచింది. ఎవరో ఒక అబ్బాయి తనను వెంబడించి వస్తూ కనిపించాడు.

"ఎవరబ్బా! నాకు కంగ్రాచ్యులేషన్సు చెబుతున్నాడు?" అని ప్రశ్నార్థకంగా అతనివైపు చూచింది మాలతి.

"మీకు నేను తెలియకపోవచ్చు. నా పేరు మధు. మీ సహాధ్యాయుడిని" అన్నాడు ఆమె సందేహం తీరుస్తూ.

"ఓ! అలాగా!" అన్నది నెమ్మదిగా.

"మీకు లాజిక్‌లో ఫస్టుమార్కు వచ్చినందుకు చాల సంతోషమండీ! అందుకే అభినందనలు తెలియ చేద్దామని యిలా వచ్చాను." అన్నాడు మధు.

"కృతజ్ఞురాలను." అన్నది మాలతి.

అంతే ఆమె యింక ఏమీ మాట్లాడలేదు. మధు వెళ్ళిపోయాడు. మాలతి మళ్ళీ నడక సాగించింది.

"మధు! ఎవరో? నేనెప్పుడూ చూడలేదే. అయినా నాకు ఎవరు తెలుసుగనుక - యీ మధు తెలియడనుకోవటానికి. అయినా అంతగా ఆదుర్దాపడుతూ వచ్చి అభినందనలు చెప్పవలసిన అవసరమేమిటో?" అనుకున్నది మాలతి. ఇంతలో యింటిని సమీపించటము చేత ఆలోచనలు అక్కడితో ఆపి లోపలికి వెళ్ళింది. వంటగదిలోకి వెళ్ళగానే తల్లి కాఫీ అందించింది. కాఫీనీళ్ళు గొంతులో పోసుకొని వచ్చి కుర్చీలో చతికిలబడింది మాలతి. మళ్ళీ ఆమె మెదడులో ఆలోచనలు బయలుదేరినయ్.

ప్రొద్దున క్లాసులో ఎవరో అబ్బాయి ఏదో ఓర్వలేక అన్నమాట మాలతికి ఎంతో బాధ కలిగించింది.

తరువాత మధు సంగతి గుర్తుకొచ్చింది. మధు మాత్రము తక్కువవాడయి వుంటాడా? ముందు అభినందనలూ — వెనుక అవమానాలు చేస్తుంటారు కొందరు. అలాంటివాడేమో యీ మధు. లేకపోతే ముక్కూ ముఖము తెలియని నాకు అభినందనలు చెప్పటానికి రావటమేమిటి? ఏమోనబ్బా! చాల జాగ్రత్తగా మెలగాలి. ఏదో చెప్తారే "మగవారికి దూరముగా మసలుతెపుడు ... ..." అని అనుకున్నది మాలతి.

ఆ రోజు గడచిపోయింది. మళ్ళీ తెల్లవారి కళాశాలకు వెళ్ళింది. ఆ రోజు ఏమీ మార్పు లేదు. మామూలుగా పాఠాలు విని తిరిగివస్తున్న మాలతికి మళ్ళీ మధు ప్రత్యక్షమయినాడు. చేతిలో ఒక పుస్తకమున్నది. మాలతిని సమీపించి తన చేతిలోని పుస్తకాన్నిస్తూ "ఇదుగోనండీ. ఈ పుస్తకము చాలా బాగుంటుంది మీరుకూడా చదువుతారని తెచ్చాను" అన్నాడు. మాలతికేమి చేయటానికి తోచలేదు. వద్దంటే ఏమి తప్పో అని "థాంక్స్" అని పుస్తకాన్ని తీసుకుంది.

"దానికేముందండీ" అంటూ వెళ్ళిపోయాడు మధు.

మాలతికి తల వేడెక్కిపోయింది. 'ఈ మధు నన్ను వదలిపెట్టేట్లులేడే?' అనుకున్నది. 'ఇంతకీ యీ పుస్తకము పనికట్టుకొని పట్టుకురాకపోతే ఏమో?' అనుకున్నది మాలతి. కాని పైకి ఏమీ అనలేకపోయింది.

మాలతిలో ఏదో మార్పు వచ్చినది. ఆమె మనస్సు స్థిమితాన్ని కోల్పోయింది. ఎప్పుడూ ఏవో పిచ్చి ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోయింది. పాఠాలు చదవటములో శ్రద్ధ తగ్గిపోయింది. తప్పనిసరిగనుక కళాశాలకు వెళ్ళి తిరిగి యిల్లు చేరుతుంది. మాలతి ఆహారము విషయములో అశ్రద్ధ చేయటము చేత ఆరోగ్యము దెబ్బతిన్నది. నీరసము ఎక్కువయింది. డాక్టర్లు విశ్రాంతి అవసరమని చెప్పారు. తిరిగి పదిరోజులకుగాని ఆమె బాగుపడలేదు. ఆ తరువాత మళ్ళీ కాలేజికి వెళ్ళింది - కాలేజి గేట్‌లో మధు కన్పించాడు. మాలతి చూచి చూడనట్లు లోపలకు వెళ్ళబోయింది. కాని మధు ఆమెను కలుసుకొని "ఏమండీ! ఈ మధ్య కాలేజికి రావటము మానేశారు. ఆరోగ్యము సరిగాలేదా?" అన్నాడు. మాలతి కొంచెం విసుగ్గా "ఔనండీ!" అని లోపలికి వేగముగా వెళ్ళిపోయింది.

మధు మౌనముగా ఉండిపోయాడు.

మాలతిలో మళ్ళీ ఆలోచనలు బయలుదేరినయ్. 'ఈ మధుకి నా స్వవిషయముతో పనేమిటో? ఒకసారి అభినందనలంటాడు. మరొకసారి పుస్తకముతో ప్రత్యక్షమయ్యాడు. ఇప్పుడు కనబడితే ఆరోగ్యం సంగతి అడుగుతాడు. ఈయన సంగతేమిటో అర్థము కాకుండావున్నదే? ఈ సారి తేల్చుకోవాలి.' అనుకున్నది మాలతి.

మళ్ళీ ఆరునెలల పరీక్షలు దగ్గరికి వచ్చినయి. పిల్లలంతా బాగా చదువుతున్నారు. మాలతిగూడా శ్రద్ధగా చదువుకుంటోంది.

ఆ రోజు సాయంకాలము ఐదుగంటలవుతుంది. మాలతి యింట్లో కూర్చుని తన క్లాసు పుస్తకాన్ని చదువుకుంటున్నది. తల్లి ప్రక్కవారింటికి వెళ్ళింది. దీక్షగా చదువుకుంటున్న మాలతి ఎవరో తలుపు నెట్టినట్లుంటే వెళ్ళి తలుపుతీసింది. అంతే. ఆమె ఆశ్చర్యపోయింది. తన క్లాసుమేటు మధు! ఇక్కడికికూడా వచ్చాడు! మాలతికి ఏదో ఆలోచన తట్టింది. ఎలాగయినా మధు విషయము తేల్చుకోవాలని ఆమె ఎదురు చూస్తున్నది. ఆ అవకాశము యిప్పుడు దొరికింది. మధుకి గట్టిగా బుద్ధిచెప్పాలని నిశ్చయించుకొన్నది. ఆమె వెంటనే "లోపలికి రండి" అన్నది. మధు మెల్లగా లోపలికివచ్చాడు. కుర్చీలో కూర్చున్నాడు.

"ఏదో పనిమీద వచ్చినట్లున్నారు" అన్నది మాలతి.

"ఔనండీ! మీ 'లాజిక్' నోట్సు యిస్తారేమోనని వచ్చాను" అన్నాడు మధు.

"అదా సంగతి! లాజిక్ నోట్సుకోసము యింత దూరము రావాలటండీ! అయినా మీకు మగపిల్లలెవరూ తెలియరా? ఆడపిల్లల నోట్సుతోనే అవసరం ఏమిటి?" అని కొంచెము కఠినముగా మాట్లాడినది మాలతి.

మధు ఆశ్చర్యపోయాడు.

మాలతి మళ్ళీ ప్రారంభించింది. "చూడండీ. నేను చాలకాలమునుండి గమనిస్తున్నాను. మీరు పనికట్టుకొని నాతో చాలా సార్లు మాట్లాడారు. మొదట్లో ఏమోనని ఊరుకున్నాను. అదే పనిగా ఆడపిల్లలతో మాట్లాడటము మర్యాదలక్షణమేనా? ఆలోచించండి. మన క్లాసు పిల్లలుగూడ యీ విషయము బాగా గమనించారు. ఏమయినా నాకు మీ ప్రవర్తన నచ్చలేదు సుమండీ! ఇకనుంచయినా మీరు మార్పుచెందుతారని ఆశిస్తున్నాను." అని చిన్న ఉపన్యాసమిచ్చింది మాలతి.

మధు కండ్లలో నీళ్ళు తిరిగినయి. మాలతివైపు చూడకుండానే చెప్పటము ప్రారంభించాడు.

"క్షమించండి. మిమ్మల్ని కష్టపెట్టాను. నిజమే. నేను మిమ్మల్ని ఒకటికి రెండుసార్లు మాట్లాడించాను. దానికి కారణము లేకపోలేదు. ఇప్పుడా కారణము మీకు చెప్పక తప్పటములేదు.

ఆరు సంవత్సరాలనాటిమాట:

అప్పటికి నాకు పన్నెండేళ్ళుంటాయి. మా చెల్లెలు పార్వతికి పది సంవత్సరాలు. పార్వతి అప్పుడు రెండవఫారము చదువుతున్నది. నా పంచప్రాణాలూ పార్వతిమీదే వుండేయి. ఎందుకంటే పార్వతితప్ప యీ ప్రపంచములో 'నా' అనేవాళ్ళు నా కెవరూ లేరు. మా యిద్దరిని ఒకరికి అండగా ఒకరిని బ్రతకమని కాబోలు తల్లిదండ్రులు తమ దారిని తాము యీ ప్రపంచమునుండి శాశ్వతముగా సెలవుతీసికొని వెళ్ళిపోయారు. అప్పటినుంచి నేను పార్వతిని నా ప్రాణముకంటె ఎక్కువ ప్రేమతో చూచుకుంటూ వచ్చాను. పార్వతి శరీరచ్ఛాయ మేలిమి బంగారంలా వుండేది. పొడవైన జడ. సన్నగా, పొట్టిగా, మూడ ముచ్చటగా వుండేది పార్వతి. చదువులోగూడ మంచి చురుకుదనము కనబర్చేది. 'అన్నయ్యా!' అని పిలుస్తుంటే నా హృదయము ఆనందముతో పొంగిపోయేది. అంతేకాదు. పార్వతి నాతో "'పితృ

సమోజ్యోతిః’ అంటే ఏమిటో అనుకున్నాను అన్నయ్యా! ఇప్పుడుగాని నాకు దాని భావము పూర్తిగా అర్థముకాలేదు” అంటూ ఉండేది. అంత చిన్న వయస్సులో పెద్దమాటలు మాట్లాడేది పార్వతి.

అటువంటి పార్వతి ... ... ఒక రోజు – నేను కలలోగూడ ఊహించలేదు.

“తల నొప్పిగా వుందన్నయ్యా” అన్నది పార్వతి.

నేను ఏదో సామాన్యమైన నొప్పి అనుకున్నాను. కాని ఆ నొప్పి అంతటితో ఆగలేదు. రెండవ రోజు పార్వతికి జ్వరము వచ్చింది. డాక్టరు దగ్గరకి తీసికొనివెళ్ళాను. మందు యిచ్చారు. నాలుగు రోజుల తరువాత పార్వతికి జ్వరము ఎక్కువయింది. ఐదవ రోజు జ్వరము చాల తీవ్రముగావుంది. పార్వతి కలవరించటము మొదలు పెట్టింది.

“అన్నయ్యా! అమ్మా నాన్న ఎక్కడికి వెళ్ళారో చెప్పు. ఏ మన్నయ్యా! చెప్పవా? సరేలే. నీవు చెప్పకపోతే ఏం? నేను పోలేనా?” అంటూ కలవరించింది.

నాకు ఏమీతోచలా. కాళ్లూ – చేతులూ ఆడలేదు. అంతే పార్వతి మళ్లీ పలకలేదు. పార్వతి! నా ఆశాజ్యోతి – ఆరిపోయింది. అప్పటినుండి నేను మళ్లీ మనిషిని కాలేకపోయాను. ఆమెను మరచిపోలేను.

రోజులు దొర్లిపోయాయి. రోజులేమిటి? సంవత్సరాలే గడచిపోయినవి. నేను స్కూలుఫైనలుపాసయి కళాశాలలోచేరాను. కళాశాలలో చేరిన పదిరోజులకే ఒక సంఘటన జరిగినది. దానిని గురించి మీకు చెప్పాలి.

ఆ రోజు మీరు క్రొత్తగా క్లాసులోకి వచ్చారు. మాలతీ! మిమ్మల్ని చూడగానే ఒక క్షణము నన్ను నేను మరచిపోయాను. మిమ్మల్ని చూస్తూవుంటే నాకు పార్వతి జ్ఞాపకము వచ్చింది. పార్వతి అచ్చు మీలాగే వుండేది. పొట్టిగా, సన్నముగా వుండేది మాపారు. అబ్బ! ఆమెనుచూచి ఎంతకాలమయిందో గదా!

మాలతీ! మీతో మాట్లాడాలనిపించింది కారణముపైన చెప్పానుగా, పార్వతి మీలాగే వుండేదని. కాని ఎలా మాట్లాడటం? అందుచేత మాట్లాడకుండానే చూస్తూ కాలము గడిపాను. ఒక రోజు మీతో మాట్లాడే అవకాశము కలిగింది. ఆ రోజు ‘లాజిక్’లో ఫస్టుమార్కు వచ్చింది మీకు. నేను అభినందించాను. తరువాతకూడ ఒకటి రెండు సార్లు మీతో మాట్లాడాను. ఎప్పుడయినా మీరు కళాశాలకు రాకపోతే నాకు ఏదో బెంగగా వుండేది. మా పార్వతి అనే దృష్టితో మిమ్మల్ని చూచాను. మీతో మాట్లాడుతుంటే మా పార్వతితో మాట్లాడుతున్నట్లనిపించేది. అందుచేతనే మీతో మాట్లాడాలని తహతహలాడాను. మాలతీ పార్వతీ ఒకరే అనుకున్నాను. పార్వతే మాలతి రూపముతో కనపడిందనుకున్నాను. అందుకే పనికట్టుకొని పలకరించాను. కాని నేనేదో దురుద్దేశముతో పలకరిస్తున్నానని మీరు భావించారు. అది నా దురదృష్టం. ఇంతకీ నీవు నన్ను అపార్థము చేసుకున్నావు మాలతీ!” అంటూ వెళ్లిపోయాడు మధు.

కడుపునొప్పి, నోట నీరూరుట, త్రేపులు, వాంతులు, మలబద్ధకము లాంటి అజీర్ణ లక్షణములకు

కేసరి గారి

ఆదిత్య లవణము

దివ్య ఔషధము

వెల రు. 1 - 75 న.పై.

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్

మద్రాసు 14.